క్లుప్తంగా

పక్షవాత బాధితురాలికి ట్రై సైకిల్ పంపిణీ



రోగికి ట్రై సైకిల్‌ను అందిస్తున్న కిరణ్

అగనంపూడి: పక్షవాతంతో బాధ పడుతున్న కొండయ్యవలస వాసి కరణం అమ్మాజీకి స్నేక్ సేవర్స్ సొసైటీ అధ్యక్షుడు రొక్కం కిరణ్‌కుమార్ మూడు చక్రాల సైకిల్ అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను విష సర్పాల బారి నుంచి రక్షిస్తున్న స్నేక్ సేవర్స్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలను కూడా ప్రారంభించామని తెలిపారు. అందులో భాగంగానే రూ.25వేల విలువైన అత్యాధునిక మూడు చక్రాల సైకిల్‌ను అమ్మాజీకి అందించామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కంచిపాటి మూర్తి, బిసాయి, తలారి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ మారువారం పండగ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి మారువారం పండగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొండయ్యవలస పరిసర గ్రామాలు, కాలనీల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కూర్మన్నపాలెం: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కూర్మన్నపాలెం పరిధిలోని నారాయణ జూనియర్ కాలేజీ (02167) పరీక్ష కేంద్రంలో సంస్కృతం/తెలుగు పరీక్షకు మొత్తం 333 మందికిగాను 323 మంది హాజరయ్యారు. 10 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

నూతన విభాగాధిపతులకు అభినందనలు



ఇంజనీరింగ్ షాప్స్ హెచ్‌వోడీని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని పలువురు నూతన విభాగాధిపతులను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు సంఘం నాయకులు అభినందించారు. ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు పలు విభాగాలకు నూతన హెచ్‌వోడీలను నియమించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన సీజీఎం సర్వీసెస్ ఎం.ఎస్.వి. కృష్ణయ్య, పీపీఎం, మైన్స్ విభాగాల సీజీఎం ఎ.కె. సోథ్రీ, ఇంజినీరింగ్ షాప్స్ హెచ్‌వోడీ ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్‌లను కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తాడన్న, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం, డి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

బర్న్ యూనిట్ పునరుద్ధరణ ఎప్పుడు?

- స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో అత్యవసర వేళ అందని వైద్యం
- బాధితులకు చికిత్సలో జాప్యం
- యాజమాన్యం చర్యలు చేపట్టాలని విన్నపం



ఉక్కు జనరల్ ఆస్పత్రి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో అత్యంత ముఖ్యమైన బర్న్ యూనిట్ లేకపోవడం తీరని లోటుగా మారింది. దీంతో ప్రమాద బాధితులకు చికిత్సలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి ప్రక్రియ అత్యంత క్లిష్టమైనది. నిత్యం వందలాది డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య ఉత్పత్తి సాగుతుంది. ఈ ప్రక్రియలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తరచూ గాయాలబారిన పడుతుంటారు. అయితే ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో బర్న్ యూనిట్ లేకపోవడం వల్ల బాధితులకు సకాలంలో వైద్యం అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెస్ట్ బర్న్ యూనిట్‌గా గుర్తింపు

స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిని ప్రారంభించిన సమయంలో అన్ని విభాగాలతో పాటు బర్న్ యూనిట్ కూడా ఏర్పాటు చేశారు. దాంతో స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందేది. ఉత్తరాంధ్రలోని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో బాధితులను కూడా చికిత్స కోసం ఇక్కడికి తరలించేవారు.కాలక్రమంలో ఈ యూనిట్ ఉత్తరాంధ్రలోనే బెస్ట్ బర్న్ యూనిట్‌గా మారింది. 2012లో స్టీల్‌ప్లాంట్ విస్తరణ ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభంలో జరిగిన ఘోర ప్రమాదంలో 18 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రమాద బాధితులకు ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వెంటనే చికిత్స అందించారు. అంతటి ప్రాధాన్యం ఉన్న బర్న్ యూనిట్‌ను ఆస్పత్రి యాజమాన్యాలు నిర్లక్ష్యం చేశాయి. కాలక్రమేణా బర్న్ యూనిట్‌ను పూర్తిగా మూసివేసే పరిస్థితికి తీసుకువచ్చారు. కరోనా నేపథ్యంలో ఉక్కు ఆస్పత్రి యాజమాన్యం బర్న్ యూనిట్‌ను పూర్తిగా మరిచిపోయేలా చేసింది.

అత్యంత ప్రాధాన్యం

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో జరిగే హాట్ మెటల్, స్టీల్ మెల్ట్ షాప్‌లో జరిగే లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి సుమారు 1400 నుంచి 1700 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య జరుగుతుంది. ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా హాట్ మెటల్, లిక్విడ్ స్టీల్ తరలించే లేడిల్స్‌కు రంధ్రాలు పడటం, వేడి మెటల్ నీటిలో పడటం ద్వారా పెద్ద ఎత్తున పేలుడు సంభవించడం వంటివి ఉక్కు పరిశ్రమలో తరచూ సంభవిస్తాయి. ఆ సమయంలో వెంటనే వైద్యం అందడం అత్యవసరం.

నగరానికి తరలింపు

తరచూ ప్రమాదాలు జరగడం, బాధితులను నగరంలోని ఆస్పత్రికి తరలించడం జరుగుతున్నాయి. గత నెల 11న స్టీల్ మెల్ట్ షాప్‌లో జరిగిన ప్రమాదంలో నలుగురు ఉద్యోగులు, ఐదుగురు కాంట్రాక్టు కార్మికుల ఒంటిపై హాట్ బర్న్స్ అయ్యాయి. ఉక్కు జనరల్ ఆస్పత్రిలో బర్న్ యూనిట్ లేకపోవడంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స అందే అవకాశం లేకపోవడంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశంపై కార్మిక సంఘాలు కూడా దృష్టి సారించకపోవడం శోచనీయం. ఇకనైనా యాజమాన్యం స్పందించి, బర్న్ యూనిట్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంఘాలు కృషి చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

బర్న్ యూనిట్ ఎంతో కీలకం



ఉక్కు జనరల్ ఆస్పత్రిలో బర్న్ యూనిట్ లేకపోవడం సరికాదు. స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రిలో ఆ విభాగం ఎంతో కీలకం. బర్న్ యూనిట్ లేకపోవడం వల్ల బాధితులను నగరంలోని ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. బాధితులకు సకాలంలో చికిత్స అందడం లేదు. ఆస్పత్రికి అతి ముఖ్యమైన బర్న్ యూనిట్‌పై యాజమాన్యం స్పందించి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

–కె.ఎస్.ఎన్. రావు, స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షుడు

ప్రజల సహకారంతోనే స్వచ్ఛత సాధ్యం



స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అక్కిరెడ్డిపాలెం: ప్రజల సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంక్ సాధ్యమవుతుందని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. షీలానగర్‌లోని మనీషా నర్సింగ్ కళాశాల వద్ద గురువారం నిర్వహించిన స్వచ్ఛ సంకల్ప అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగంతో మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని కోరారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 68వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ శానిటరీ విభాగం కార్యదర్శులు, ఇతర శాఖల కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలానుగుణంగా బోధనలో మార్పులు తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గురుప్రసాద్

అగనంపూడి: విద్యార్థి కేంద్రీకృత విద్యావిధానంలో వైఫల్యాలు లేకుండా చర్యలు తీసుకుంటే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని బెంగళూరుకు చెందిన బీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సురేష్ రామస్వామి రెడ్డి అన్నారు. ఔట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్‌పై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యా విధానంలో సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల ప్రభావం వల్ల రోజురోజుకూ మార్పులు వస్తున్నాయన్నారు. బీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ హెచ్.ఎస్.గురుప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానం, పరిస్థితులు, కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధన సాగించినప్పుడు సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వక్త జి.వరప్రసాద్, కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమం కో–ఆర్డినేటర్ హరగోవిందరావు, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి మూర్తి సేవలు మరువలేం

మేయర్ హరివెంకట కుమారి



మూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకునిగా మంత్రి మూర్తి అందించిన సేవలు మరువలేమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. నడుపూరులోని ఆయన నివాసంలో మంత్రి రాజశేఖర్, శంకర నారాయణ ఆధ్వర్యంలో గురువారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి చిత్ర పటానికి మేయర్ హరివెంకటకుమారి దంపతులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, గొలగాని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్మిక సంఘ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, గొందేశి సత్యారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొని, సంతాపం వ్యక్తం చేశారు.

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 763వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఎంఎంఎస్ఎం మరియు ఎస్‌టీఎం కార్మికులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి, ప్రభుత్వరంగ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమల వలన దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, ఇది దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్మిక హక్కులు అమలవ్వాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. ఈ వారాంతానికి పోరాట కమిటీ సభ్యులంతా ఢిల్లీ వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యకమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

ఘనంగా నిత్య కల్యాణం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు,ప్రసాదం అందజేశారు.

69వ వార్డులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు రెడ్డితుంగ్లాం సచివాలయ పరిధిలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. గర్భిణులకు, మధుమేహ, రక్తపోటు వ్యాధి గ్రస్తులకు పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులను అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి, వారికి వైద్య పరీక్షలు చేశారు. మందులు అందించి, పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. బాలింతలకు వైద్య పరీక్షలు చేసి, సూచనలిచ్చారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్లకు ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎస్.రాజు వెళ్లి, ఎండాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఫ్రై డేను డ్రై డేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శి ఆర్.పద్మావతి, సిబ్బంది షమీ, ఆశ కార్యకర్త సీహెచ్.వరలక్ష్మి, పలు విభాగాల సచివాలయ కార్యదర్శులు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

కనులపండువగా గోవిందమాంబ ఆరాధనోత్సవం



గోవిందమాంబను దర్శించుకుంటున్న నాయకులు

గాజువాక: గాజువాక బ్రహ్మగిరిపై ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మాతా గోవిందమాంబ ఆరాధనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబలకు పట్టు వస్త్రాలను సమర్పించి, విశేష పూజలు చేశారు. బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు దర్శించుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, కేంద్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సిరసపల్లి నూకరాజు, స్థానిక, విశ్వబ్రాహణ సంఘం నాయకులు తిరుమలరాణి, గణపతి పంతం, కామమాను వెంకటవేణు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఉద్యోగులకు ఎముక సాంద్రత పరీక్ష



సిబ్బందికి ఎముక సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెగ్యులర్, కాంట్రాక్టు, సెక్యూరిటీ, శానిటేషన్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు రోజులుగా ఉచిత ఎముక సాంద్రత పరీక్ష నిర్వహిస్తున్నారు. 45 సంవత్సరాలు దాటిన స్త్రీలు, 55 సంవత్సరాలు దాటిన పురుషులకు ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ఎం డాక్టర్ జగదీష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ రెండు రోజుల పాటు 242 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బోన్ డెన్సిటీ తగ్గితే ఎముకలు విరిగిపోవచ్చన్నారు. ఎముకల్లో కాల్షియం సాంద్రత తక్కువగా ఉంటే ఆలసట, నీరసానికి గురి కావడంతో పాటు ఎక్కువ దూరం నడవలేరని అన్నారు. అలాంటి వారు ఆకుకూరలు, మాంసాహారంతో పాటు కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలని తెలిపారు.

అమరజీవికి ఘన నివాళి



ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెదగంట్యాడ గ్రంథాలయంలో ..



అగనంపూడి కూడలిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: భాషాప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యుడు, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మూలపురుషుడు పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, ప్రజా సంఘాల నాయకులు కోసూరి తాతారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరాముల సేవా నిరతిని కొనియాడారు. ఎస్.అప్పారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

పెదగంట్యాడ: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి శిరీష అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సురేష్, సూర్య, మహేష్, వేణు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

పొట్టి శ్రీరాములు జయంతిని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నడుపూరు హైస్కూల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో వాసవీ క్లబ్ పెదగంట్యాడ ప్రతినిధులు కులుకూరి శ్రీనివాసరావు, వీఎన్ శ్రీనివాసరావు, వీఆర్‌కేఎన్ కుమార్, చిత్తూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉక్కు యాజమాన్యం ఆధ్వర్యంలో ఉక్కు హిల్ టాప్ కూడలి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి టౌన్ అడ్మిన్ డీజీఎం బాబు నాయక్ పూలమాల వేసి నివాళి అర్పించారు. విభాగం అధికారులు శివరామకృష్ణ, బోయ్, సర్వేశ్వరరావు తదితరులు నివాళి అర్పించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిది

తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న లక్ష్యంతో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎనలేనిదని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప అన్నారు. అటువంటి త్యాగధనులను స్మరించుకోవడం, వారి అడుగుజాడల్లో నడవడమే మనం సమర్పించే నివాళి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి యూనియన్ నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో డి. పుల్లారావు, జి. అప్పలరెడ్డి, ఎ. గోవిందరావు, పి. మూలయ్య, కె. మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటు అభివృద్ధి.. ఇటు అవస్థ

పాతగాజువాక జంక్షన్‌లో రాకపోకలకు కష్టాలు



దుమ్ములో నుంచి వెళ్తున్న వాహనాలు

గాజువాక: పాతగాజువాక జంక్షన్ విస్తరణ పనులు ప్రజలకు యాతనగా మారాయి. జంక్షన్‌ను విస్తరిస్తున్నారన్న ఆనందం ఉన్నప్పటికీ అక్కడ ఎదురవుతున్న ఇబ్బందులతో జనం అవస్థలు పడుతున్నారు. మరోపక్క జంక్షన్‌లో భారీ ఎత్తున దుమ్ము లేచి కళ్లల్లో పడుతుండటంతో అటువైపు వెళ్లేవారు హడలిపోతున్నారు. ట్రాఫిక్ కష్టాల పరిష్కారంలో భాగంగా పాతగాజువాక జంక్షన్‌ను విస్తరించి అభివృద్ధి చేసేందుకు మూడు వారాల క్రితం పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనికోసం అక్కడున్న పాత డివైడర్లను తొలగించిన అధికారులు, కొత్త లైన్లను ఏర్పాటు చేసి ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆ జంక్షన్ మొత్తం మట్టితో నిండిపోయి భారీగా దుమ్ము లేస్తోంది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు కూడా సరిగా కనిపించనంతగా వస్తున్న దుమ్ముతో ఏ వాహనం ఎటునుంచి వస్తుందో కూడా సరిగా కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. ట్రయల్ రన్‌పై ఇంకా స్పష్టత రాని కారణంగా ఈ పనులు పూర్తయ్యేందుకు మరికొంత సమయం అధికంగా పట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. జంక్షన్‌లో ట్రాఫిక్‌ను అధికారులు, నిపుణుల బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అయినా కొలిక్కి రావడానికి మరికొంత సమయం పడుతుందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



తలకు గాయమైన గీతం



తరుణ్ కాలికి అయిన గాయం

అక్కిరెడ్డిపాలెం: నడిచి వెళ్తున్న విద్యార్థులను ద్విచక్రవాహనం ఢీ కొనడంతో, వాహన చోదకుడితో పాటు ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన రవీంద్ర భారతి స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న గీతం, తరుణ్ గురువారం రాత్రి గాజువాకలోని సీఎంఆర్ సెంట్రల్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో పాత గాజువాక నుంచి శ్రీనగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న కిల్లాడ శ్రీకాంత్ అనే యువకుడు, వారిద్దరినీ ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఒక విద్యార్థి గీతం తలకు గాయాలు కాగా, మరో విద్యార్థి తరుణ్‌కు కాలు ఫ్రాక్చర్ అయింది. వాహనం నడుపుతున్న శ్రీకాంత్ అదుపుతప్పి పడిపోవడంతో, అతనికి కూడా గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. గాజువాక సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు చెప్పారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు

సీతమ్మధార: ఆశీలమెట్ట శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారులు వి.వసంతకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో 21 రోజులకు రూ.16.36 లక్షల నగదు, 25.700 మిల్లీగ్రాముల బంగారం, 133 గ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన డాలర్లు వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.